క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



పూజలో మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో గణపతి, సాయిబాబా, శివాలయం, బ్రహ్మం గారి దేవాలయం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి వ్యక్తి భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పుల నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదే

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

తాండూరు రూరల్: రాష్ట్రంలో భవిష్యత్ బీజేపీదేనని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తాండూరు మండలం చింతమణిపట్నం, చెంగోల్, పర్వాతపూర్, గౌతపూర్ గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటుతుందన్నారు. యువకులు పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వం తీసుకోవడం శుభసూచకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, ఓబీసీ రాష్ట్ర నాయకుడు శాంతుకుమార్, వడ్ల విజయ్‌కుమార్, నరేందర్ రెడ్డి, కిరణ్, మల్లేష్, రవికుమార్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వకు మరమ్మతు పనులు



జేసీబీతో మురుగు కాల్వను శుభ్రం చేయిస్తున్న అధికారులు

దుద్యాల్: మండల కేంద్రంలోని 11వ వార్డులో మురుగు కాల్వ మట్టితో పూడుకుపోయింది. దీంతో అక్కడ మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతుండడంతో పంచాయతీ అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ వెంటనే మురుగు కాల్వ పనులను జేసీబీ సహాయంతో ఆదివారం శుభ్రం చేయించారు.

పేదలకు అండగా ఉంటాం

దోమ: పేద కుటుంబాలకు తాము అండగా ఉంటామని కాంగ్రెస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రాం రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో చిన్న నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారు ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం ఇరు పార్టీల నేతలు ఆర్థిక సాయం చేశారు.

రైతు ఆలోచన భలే



కట్టలు కట్టిన వరి

దుద్యాల్: ఇటీవల కురిసిన వర్షాలకు, అధిక వేగంతో వీచిన గాలికి వరి పంట నేలకొరిగింది. అవి మొలకెత్తే అవకాశం ఉండడంతో రైతు తన ఆలోచనతో పంట మొక్కలను కొన్నింటిని కలిపి ఒక కట్టగా కట్టాడు. దీంతో అవి ఏపుగా నిలిచాయి. కుదురుమల్లలోని ఓ పొలంలో రైతు ఇలా చేయడాన్ని పలువురు చూసి అభినందిస్తున్నారు.



వరి సాగు



బ్లాక్ సోనా

ఆదర్శం.. ప్రకృతి వ్యవసాయం

- ఆరేళ్లుగా నిర్వహిస్తున్న అన్నదాత
- తోటి రైతులకు అవగాహన కల్పిస్తున్న వైనం
- 20 రకాల దేశీయ వరి వంగడాలతో సాగు



రకత శాలి వరి



నవార వరి రకం

దుద్యాల్: నేటి కాలంలో వ్యవసాయం ఖర్చుతో కూడుకుంది. రసాయనిక ఎరువులు వినియోగించకపోతే పంటలు పండే పరిస్థితి అంతతమాత్రమే. విత్తనం నాటిన నాటి నుంచి పంట చేతికొచ్చేంత వరకు ఎన్నో వ్యయప్రయసాలనోర్చి సాగు చేయాలి. అనేక రకాల మందులతో పిచికారీ చేయాలి. ఆరేళ్లుగా ప్రకృతిని నమ్ముకుని రసాయనిక ఎరువులను వినియోగించుకోకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయం దిశగా ఆసక్తిని నింపుతున్నాడు, అవగాహన కల్పిస్తున్నాడు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామానికి చెందిన వడ్ల మల్లేశ్ తన కున్న పొలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. ఏకంగా 20 రకాల దేశీయ వరి వంగడాలతో సాగు చేస్తున్నాడు. దేశీయ వరి వంగడాలైన కుజ్జి పటాలియా, రకత శాలి, కుశాకర్, ఎల్7, జే24, వీ9, నవారా, బ్లాక్ సోనా, ఎస్1 వంటి వరి వంగడాలను సాగు చేస్తున్నాడు. ఈ విత్తనాలు గతంలో మన పూర్వికులు పండించేవారు. నేటి కాలంలో ఇలాంటివి ఎవరు కూడా సాగు చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో పూర్తిగా కనుమరుగయ్యాయని రైతు మల్లేశం వాపోతున్నాడు. ఎరువులు వేయకుండా సాగుచేసే విత్తనాలకు బలం ఎక్కువగా ఉంటుందని, అలాంటి వరిని ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ప్రకృతి ప్రేమికులు చర్చించుకుంటున్నారు. ఇలా అత్యంత శక్తి కలిగి ఉండే వరి సాగు చేయడం వల్ల, వాటిని ఆహారంగా తీసుకుంటే రోగాలు దరిచేరవని చెబుతున్నారు. పండించే ప్రతి వరి వంగడాలకు ఎలాంటి రసాయనిక మందులు వాడడం లేదని రైతు చెబుతున్నాడు. ప్రతి వంగడం కూడా ఒకటి లేదా రెండు గుంటల భూమిలో సాగు చేస్తూ విత్తనాలు తయారు చేస్తున్నాడు. విత్తనాలు తయారు చేస్తూ కొత్తగా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మాత్రమే అవసరం మేరకు విత్తనాలను సరఫరా చేస్తున్నాడు. ఏదిఏమైనా ఇలా మారు మూల ప్రాంతంలో ఇన్ని రకాల వరి వంగడాలతో ప్రకృతి వ్యవసాయం చేయడం అందరికీ ఆదర్శమే. తోటి రైతులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు రైతు మల్లేశం. పండించిన వివిధ రకాల వరి వంగడాల విత్తనాలను వికారాబాద్, నారాయణపేట్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మూడేళ్లుగా వందల సంఖ్యలో రైతులకు సరఫరా చేసినట్లు ఆయన చెప్పారు.

మరిన్ని వంగడాలతో..



ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి కోసం ప్రయత్నం చేస్తున్నా. అయిన సరే వరి సాగుకు వెనకాడను. ఆరేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి మళ్లింది. మూడేళ్లుగా వరి వంగడాల విత్తనాలు తయారు చేసి తోటి రైతులకు సహకారం అందిస్తున్నాను. వారిని ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహిస్తున్నాను. మునుముందు మరిన్ని వంగడాలతో సాగుకు ప్రయత్నిస్తాను.

– వడ్ల మల్లేశ్, రైతు, పోలేపల్లి

టీఆర్ఎస్ నాయకులే బీఆర్ఎస్‌లో చేరారు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్



మాట్లాడుతున్న ప్రశాంత్

కొడంగల్: గతంలో టీఆర్ఎస్ నాయకులే ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరారని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పర్సాపూర్ మాజీ సర్పంచ్ కన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలో లాహోటీ కాలనీలోని సీఎం రేవంత్ నివాసంలో ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎంపీపీ దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాదన్నారు. ఆయన 2017లో టీఆర్ఎస్‌లో చేరిన వ్యక్తి అని గుర్తు చేశారు. టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత ఎంపీపీ పదవి పోయిందన్నారు. దయాకర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదన్నారు. ఆయన సొంత గ్రామం పర్సాపూర్‌లో కూడా ఆయనకు పలుకుబడిగానీ, ఓటు బ్యాంకుగానీ లేదని విమర్శించారు. అతను ఎంపీపీగా ఉన్నప్పుడు గ్రామానికి చేసిందేమీ లేదని గుర్తు చేశారు. నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జి నర్మద కిష్టప్ప ఒక్కరే శనివారం హైదరాబాద్‌కు వెళ్లి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. మిగిలిన వారందరూ గతంలో టీఆర్ఎస్‌లో ఉన్న వారే ఇప్పుడు బీఆర్ఎస్ కండువాలు కప్పుకున్నారని ఎద్దేవ చేశారు. ఈ సమావేశంలో ఇంద నూర్ మాజీ సర్పంచు బాల్‌రెడ్డి, పర్సాపూర్ గ్రామస్తులు శ్రీనివాస్, మల్లేశం, బానకారి నర్సిములు, సూరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం ముమ్మరం

బొంరాస్‌పేట: మండల పరిధిలోని గ్రామాల చెరువుల్లో ఈ ఏడాది చేపల పెంపకం ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని ఏర్పుమళ్ల కాకర్‌వాణి ప్రాజెక్టు, బురాన్‌పూర్ చిన్నవాగు ప్రాజెక్టు, పెద్ద చెరువుతోపాటు 10నోటిఫైడ్ చెరువులు, 38 కుంటలున్నాయి. వీటిలో మత్స్యకారులు, కొన్ని చోట్ల ఆయకట్టుదారులు చెరువుల నిర్వహణ చేస్తున్నారు. ఈసారి చెరువులు కుంటలు నిండటంతో చేపల పెంపకం మరింత పెరిగింది. చేపల పెంపకం కోసం ఈ సారి చేపపిల్లల ధరలు కూడా పెరిగాయని పెంపకందారులు చెబుతున్నారు. గతేడాది వెయ్యి చేపపిల్లలకు రూ.700వరకు ఉండగా ఈ ఏడాది రూ.వెయ్యికి పెరిగింది. గ్యాస్‌కట్, బాంగారుతీగ, బొచ్చెలు చేపల పెంపకానికి డిమాండ్ ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు.

రాములు కుటుంబాన్ని ఆదుకోవాలి

కుల్కచర్ల: బహుజన వాదాన్ని, బహుజన నాయకుల గొంతుకను ప్రజల్లోకి తీసుకెళ్లిన జర్నలిస్ట్ రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వనం నరసింహా పేర్కొన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామంలో జర్నలిస్ట్ రాములు గౌడ్ దశదినకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బహుజనవాదాన్ని పత్రికలద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాములు కృషి మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్, మండల అధికార ప్రతినిధి మొగులయ్య, సంఘ నాయకులు గుండుమళ్ల నర్సింలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



పూడూరు: ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

పూడూరు: పూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 2002–2003 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులను ఒకే వేదికపై కలిశారు. 20 యేళ్ల క్రితం పూడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు తమ చిలిపి చేష్టలు, తీపిగుర్తులను స్మరించుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులు అష్టవధాని అంజయ్య, రవూఫ్, సాయన్న, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కిషన్, నర్సిరెడ్డి, వెంకట్‌రెడ్డి, నళిని, లక్ష్మినర్సమ్మలను ఘనంగా సన్మానించారు.

బషీరాబాద్‌లో..

బషీరాబాద్: బషీరాబాద్ మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2007–08 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నారు. ఆదివారం కొరవిచెడ్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు మాధురి, పురుషోత్తం, ఆనంద్, వెంకట్ స్వామి, జగదీష్, సురేష్, రాములు, సతీష్, జగదేవి, నాగరాజు, భాగ్యలక్ష్మి, పాషా, పూర్వ విద్యార్థులు సతీష్, శాంత్ కుమార్, రాజేందర్ రెడ్డి, ముక్తర్, అరవింద్, వికాస్, రవీందర్, మోహన్, రమేష్, రవికుమార్, అంజి, యాదయ్య, బసయ్య, నరేందర్, సతీష్, వికాస్, సాకారం, కుమార్, జహీర్, అహ్మద్ పాల్గొన్నారు.



బషీరాబాద్‌లో..

ఉర్దూ మీడియం పోస్టులు భర్తీ చేయండి

మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డికి నిరుద్యోగుల వినతి



మహేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

తాండూరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆదివారం తాండూరులో మండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 20 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉర్దూ చదివిన అనేక మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. ప్రత్యేక డీఎస్సీ ద్వారా సుమారు 666 పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఖాజాపాషా, సభ్యుడు అబ్దుల్ నాసర్, అబ్రహం, రేహాన్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పట్నం మహేందర్‌రెడ్డికి సన్మానం



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పెద్దేముల్: శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డిని ఆదివారం మంబాపూర్ గ్రామంలో పలు గ్రామాల స్థానిక నాయకులు, అనుచరులు, అభిమానులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. మంబాపూర్, మన్‌సాన్‌పల్లి, కొండాపూర్, మారేపల్లి, దుగ్గాపూర్ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మాజీ ఉప సర్పంచ్‌లు ప్రకాశం, యాలటి శ్రీనివాస్, బలవంతు రెడ్డి, దుగ్గాపూర్ శ్రీనివాస్, మాన్యానాయక్, లాజర్, నారాయణ, సంతోష్, యాసవి రమేష్, ఖలీల్, శ్రీనివాస్ తదితరులు చీఫ్‌విప్‌కు సన్మానం చేశారు. మహేందర్‌రెడ్డిని చీఫ్‌విప్‌గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

వర్షాలకు పాడైన ఉల్లి నారు

- ఇబ్బందుల్లో రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



పెద్దేముల్‌లో పాడైన ఉల్లి నారును చూపుతున్న రైతు ఏసప్ప

పెద్దేముల్: ఇరువై రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పెద్దేముల్ మండలంలోని గోట్లపల్లి, పెద్దేముల్, హన్మాపూర్, గిర్మాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఉల్లి నారుమడులు పాడయ్యాయి. దీంతో ఉల్లి రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో ఉల్లి నారు ఖరీదు చేయాలన్నా, సమయానికి దొరకటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి గడ్డకు మార్కెట్లో డిమాండ్ బాగా ఉందని చెబుతున్నారు. గతంలో ఎకరా పొలంలో ఉల్లి నారు సాగు చేయాలంటే సుమారు ఎనిమిది నుంచి పది కిలోల ఉల్లి విత్తనాలు చల్లితే సరిపోయేది. కానీ ప్రస్తుతం 20 కిలోల ఉల్లి విత్తనాలు చల్లినా 20గుంటల భూమికి కూడా సరిపోవడం లేదని చెబుతున్నారు. ఎకరా పొలానికి సుమారు రూ.50వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. పెద్దేముల్ గ్రామానికి చెందిన మాలే ఏసప్ప రూ.900లకు కిలో విత్తనాలు వికారాబాద్‌లో ఖరీదు చేసి నారుకోసం వేశాడు. నారు ఎదిగే సమయంలో భూమిని పలు మార్లు శుద్ధి చేయించాడు. చివరకు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారు పాడయ్యాయి. దీంతో అతనికి ఏమి చేయాలో అర్థంకాక లబోదిబోమంటున్నాడు. ప్రస్తుతం గ్రామాల్లో నారు ఖరీదు చేయాలన్నా అవీ అందుబాటుల్లో లేదని చెబుతున్నాడు. ఈ విషయంలో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. మార్కెట్లో ఉల్లి గడ్డకు దినదిన ధరలు పెరుగుతుండడంతో ఉల్లి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మున్నూరు కాపులంతా కలిసి ఉంటేనే బలం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

కొడంగల్: మున్నూరు కాపులంతా ఒక కుటుంబ సభ్యులేనని సంఘం ప్రతినిధి బాకారం చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం దుద్యాల మండలం అలిఖాన్‌పల్లిలో మున్నూరు కాపు కులస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కులబంధువులు అందరూ ఏకం కావాలన్నారు. వ్యక్తిగతంగా ఏమైనా సమస్యలు ఉంటే కుల పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. కలిసి మెలిసి ఉంటేనే బలం పెరుగుతుందన్నారు. ఈ సంవత్సరం సంఘం కేలండర్‌ను ముద్రిస్తున్నట్లు చెప్పారు. కేలండర్ ముద్రణలో మున్నూరుకాపు కులస్తులు భాగస్వాములు కావాలన్నారు. త్వరలో అలిఖాన్‌పల్లి గ్రామ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బాకారం మల్లయ్య, కానుకుర్తి రమేష్, మున్నూరు బిచ్చప్ప, కానుకుర్తి నర్సిరెడ్డి, అరిగె ఓం ప్రకాశ్, శ్యాం సుందర్, సిరుసని చుక్కయ్య, బొంకురు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై లాఠీ-చార్జీ బాధాకరం

బహుజనముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్

పరిగి: గిరిజనులపై లాఠీచార్జీ చేయడం బాధాకరమని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం రోటీబండ తండావాసులపై పోలీసులు దాడులు చేయడం ఎంటని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట పేదల భూములను లాక్కోవడం సరైన పద్ధతికాదన్నారు. ఫార్మకంపనీకి భూములు ఇవ్వకుంటే గిరిజనులపై పోలీసులతో దాడులు చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వ తీరును మార్చుకోవాలని లేదంటే గిరిజనులంతా ఏకమై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎంపీ చేవెళ్ల ఇంచార్జ్ గోవింద్ నాయక్, రవీందర్‌నాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.



పరిగి: మాట్లాడుతున్న గట్యానాయక్



కొడంగల్ రూరల్: సంఘీబావం ప్రకటిస్తున్న దళిత బహుజన శ్రామిక యూనియన్ సభ్యులు

కొడంగల్ రూరల్: ఫార్మాసిటీ కోసం రైతుల పొలాలు గుంజుకోవడం సరికాదని దళిత బహుజన శ్రామిక యూనియన్ (డీబీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు సి ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో డీబీఎస్‌యూ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లగచర్ల, పోలేపల్లి, హకీంపేట, దుద్యాల, పులిచర్ల తండా, రోటిబండ తండాలోని రైతుల పొలాలను ఫార్మాసిటీ కోసం గుంజుకోవడం సరికాదన్నారు. రైతులకు మద్దతుగా తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి లింగం సాయిలు మాట్లాడారు. నెల రోజులనుంచి కొడంగల్, బొంరాస్‌పట, దౌల్తాబాద్, దుద్యాల్, దోమ తదితర మండలాల్లో గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేసుకుంటూ, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.